నేడు సురేఖపై కేటీఆర్ పరువు నష్టం కేసు విచారణ

వివరణ ఇవ్వాలని సురేఖకు కోర్టు నోటీసులు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం క్రిమినల్ కేసు విచారణను బుధవారం ప్రజాప్రతినిధుల కోర్టు స్వీకరించనుంది. ఇప్పటికే ఈ కేసులో ఫిర్యాదుదారుడు కేటీఆర్‌తో పాటు సాక్షులుగా ఉన్న తుల ఉమ, బాల్కసుమన్, దాసోజు శ్రవణ్, సత్యవతి రాథోడ్‌ల వాంగ్మూలాలను కోర్టు నమోదు చేసింది. కేటీఆర్ చేసిన ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు కొండా సురేఖకు కోర్టు అవకాశం కల్పించింది. వ్యక్తిగతంగా హాజరుకావాలని కోర్టు ఆదేశించినప్పటికీ ఆమె తరపున న్యాయవాది హాజరై కౌంటర్ దాఖలు చేయనున్నారు. అనంతరం కేసు నమోదు కోసం కోర్టు తీర్పును రిజర్వు చేయనుంది. ఇటీవల సినీనటుడు నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం క్రిమినల్ కేసును కోర్టు నమోదు చేసుకున్నట్టు మేజిస్ట్రేట్ శ్రీదేవి సంచలన తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. కేటీఆర్ దాఖలు చేసిన కేసును కూడా కోర్టు స్వీకరించి ఆమెపై 356 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసే అవకాశం అధికంగా ఉందని సీనియర్ న్యాయవాదులు, విశ్లేషకులు అంటున్నారు.

క్రమశిక్షణ పాటించకపోతే కఠిన చర్యలు

సింగరేణి సీఎండీ బలరాం

హైదరాబాద్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): సింగరేణిలోని అధికారులు, సిబ్బంది అంతా క్రమశిక్షణ పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎండీ ఎన్ బలరాం హెచ్చరించారు. బొగ్గు ఉత్పత్తిపై మంగళవారం అన్ని ఏరియాల జీఎంలతో సీఎండీ సమీక్షించారు. ఉదయం 7గంటలకల్లా గనుల వద్దకు చేరుకోవాలని, 8 గంటల పాటు విధిగా పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కంపెనీ యంత్రాల పనితీరును మెరుగుపరచాలని, కనీసం 18 గంటలు వినియోగించాలని సూచించారు. పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు బొగ్గు సరఫరా చేసేందుకు వీలుగా ఉత్పత్తిని పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 120 రోజుల్లో ఉత్పత్తి లక్ష్యసాధనకు సమష్టిగా కృషిచేయాలని సూచించారు. కొత్తగూడెం వీకే ఓసీ, ఇల్లందులోని రొంపేడు ఓసీల్లో వచ్చే మూడు నెలల్లో ఉత్పత్తిని ప్రారంభించాలని ఆదేశించారు. ఒడిశా నైనీ కోల్‌బ్లాక్‌లో చెట్లగణన కొంతమేర పూర్తయ్యినందున బొగ్గు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

లంచం ఇవ్వకండి.. సమాచారం ఇవ్వండి!

ఏసీబీ డీజీ విజయ్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 9 వరకు తెలంగాణవ్యాప్తంగా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయంలో 'లంచం ఇవ్వకండి.. సమాచారం ఇవ్వండి' అనే పోస్టర్, బ్రోచర్లను విజయ్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ ఉన్నతాధికారులు, కలెక్టర్లు ఈ పోస్టర్లను ఆవిష్కరించినట్టు తెలిపారు.

బోనస్‌గా ఇచ్చింది 251 కోట్లే!

- ప్రభుత్వ కొనుగోళ్లలో సన్న రకాల వాటా 29 శాతమే
- 71% దొడ్డు రకాలకు దక్కని బోనస్
- ఇప్పటికీ కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం 31 లక్షల టన్నులు
- అందులో సన్నాలు 9 లక్షల టన్నులే
- సర్కార్ కంటే మిల్లర్లు కొన్నదే ఎక్కువ

హైదరాబాద్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): సన్నధాన్యం పండించిన రైతులకు బోనస్ రూపంలో దక్కింది తక్కువే అయినా, ప్రభుత్వం మాత్రం భారీ స్థాయిలో ప్రచారం చేసుకుంటున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రైతుల నుంచి ప్రభుత్వం ఈ సీజన్‌లో ఇప్పటివరకు 31 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇందులో సన్నధాన్యం తొమ్మిది లక్షల టన్నులు మాత్రమే ఉన్నది. ఇందుకు రైతులకు చెల్లించిన బోనస్ కేవలం రూ.251 కోట్లు. ఈ మాత్రం దానికే ప్రభుత్వం పెద్ద ఎత్తున్న ప్రచారం చేసుకోవడం గమనార్హం. మిగిలిన 22 లక్షల టన్నుల ధాన్యం దొడ్డరకం కావడంతో దానికి ప్రభుత్వం బోనస్ చెల్లించడం లేదు. సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యంలో 71% ధాన్యానికి బోనస్ దక్కలేదు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంలో కేవలం 29% ధాన్యానికే బోనస్ ధర లభించడం గమనార్హం.

సన్నాల అంచనాలు తలకిందులు

సన్నధాన్యం సేకరణపై సివిల్ సప్లై అంచనాలు పూర్తిగా తలకిందులయ్యాయి. బోనస్ ప్రకటనతో భారీగా సన్నాల సాగు పెరిగిందని, భారీ మొత్తంలో సన్నాల దిగుబడి వస్తుందని అధికారులు చెప్తూ వచ్చారు. ఈ సీజన్‌లో 48 లక్షల టన్నుల సన్నాలను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఇంత భారీ మొత్తంలో సన్నాలను కొనుగోలు చేస్తున్నాం కాబట్టి రైతులకు భారీ మొత్తంలో బోనస్ వస్తుందని మంత్రి పలుమార్లు పేర్కొన్నారు. రోజులు గడుస్తున్నా కొద్దీ అధికారులకు, మంత్రులకు వాస్తవం బోధపడింది. ఆశించిన స్థాయిలో సన్నాలు వచ్చే అవకాశం లేదని అర్థమైంది. దీంతో సన్నాల కొనుగోలు లక్ష్యాన్ని 48 లక్షల నుంచి 35 లక్షలకు తగ్గించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడం కూడా కష్టమేనని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి 9 లక్షల టన్నులు సన్నాలు కొనుగోలు చేయగా, మరో 7-8 లక్షల టన్నులు వస్తుందని భావిస్తున్నారు. ఈ లెక్కన ఈ సీజన్‌లో సన్నాల కొనుగోలు మొత్తంగా 15 లక్షలకు మించకపోవచ్చనే అభిప్రాయాన్ని సివిల్ సప్లై అధికారులు వ్యక్తంచేస్తున్నారు.

మిల్లర్లు కొన్నది 25 లక్షలు.. సర్కారు కొన్నది 9 లక్షలే

సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రకటించిన సర్కారు.. వాటిని కూడా సరిగ్గా కొనుగోలు చేయలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు వీలైనంత ఎక్కువగా సన్న ధాన్యం ప్రైవేటు మార్కెట్‌కు తరలివెళ్లేలా అధికారులు ప్లాన్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ప్రభుత్వం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం చేశారని తెలిసింది. ఎప్పుడో అక్టోబర్ 1 నుంచే కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం ఆదిలో తాత్సారం చేసింది. నవంబర్‌లో మాత్రమే కొనుగోళ్లను వేగవంతం చేసింది. అప్పటికే రైతులు తాము పండించిన సన్న ధాన్యంలో అధిక భాగం ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లకు విక్రయించారు. ఇప్పటివరకు ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు సుమారు 25 లక్షల టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు సమాచారం. ప్రైవేటు వ్యాపారులు అంత భారీ మొత్తంలో కొనుగోలు చేయగలిగినప్పుడు ప్రభుత్వం ఎందుకు చేయలేకపోయిందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇందుకు అధికారుల నిర్లక్ష్యం, బోనస్ భారాన్ని తగ్గించుకోవాలనే ఆలోచన కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'దొడ్డు' రైతులకు ఎగనామం

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత సన్న ధాన్యానికి మాత్రమే అదీ ఎంపిక చేసిన రకాలకు మాత్రమే బోనస్ చెల్లిస్తామని షరతు పెట్టింది. దీంతో తెలంగాణలో ఎక్కువగా పండే దొడ్డు రకాలకు బోనస్ దక్కడం లేదు. సన్నాలకు బోనస్‌తో తమకు పెద్దగా ఒరిగేదేమి లేదని రైతులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

గత ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తాం

- గత 15 ఏండ్లలో వేగవంతంగా రాష్ట్ర అభివృద్ధి
- భవనాలు, లేఅవుట్ల కోసం ఏకీకృత పోర్టల్
- మంత్రి డీ శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో గత ప్రభుత్వం (బీఆర్ఎస్)తో తమకు సిద్ధాంతపరమైన రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ.. ఈ రాష్ట్ర ప్రగతికి సంబంధించి కేసీఆర్ అనుసరించిన ప్రగతిశీలమైన విధానాలను కొనసాగిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబు చెప్పారు. సచివాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన దానికంటే ఇంకా మెరుగైన విధానాలను అమలు చేయడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు. గడిచిన 10-15 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్లనే తెలంగాణ దేశంలోనే హయ్యెస్టు పెర్‌ఫార్మర్‌గా నిలిచిందని చెప్పారు. తెలంగాణ వార్షిక వృద్ధి రేటు 11 శాతానికి పెరిగిందని, తలసరి ఆదాయం 19.3 శాతం పెరిగిందని అన్నారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పరుచుకున్న హైటెక్ సిటీతో అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చాయని, దీంతో చాలామందికి ఉపాధి కల్పన పెరిగిందని తెలిపారు.

ఫిబ్రవరి 1 నుంచి 'బిల్డ్ నౌ'

రాష్ట్రంలో భవనాల నిర్మాణాలు, లే అవుట్ల అనుమతుల కోసం 'బిల్డ్ నౌ' పేరిట ప్రభుత్వం నూతన ఆన్‌లైన్ విధానంలో ఏకీకృత పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ విధానం వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. సచివాలయంలో మంగళవారం అధికారులతో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణాలు, లేఅవుట్ల కోసం దరఖాస్తులు, స్టేటస్ ట్రాకింగ్, ఫీజు చెల్లింపులు తదితర వాటన్నింటికీ కలిపి ఒకే వేదికను ఏర్పాటు చేసేందుకు ఈ ఏకీకృత పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. దరఖాస్తు దాఖలు సమయాన్ని తగ్గించామని, నాన్-హై-రైజ్ భవన అనుమతులకు 21 రోజుల నుంచి 15 రోజులకు తగ్గించామని తెలిపారు. పది రోజుల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ అయ్యేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఈ కొత్త విధానంపై ఆర్కిటెక్టులు, ప్రభుత్వ అధికారులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లతో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు.

జిల్లాలవారీగా డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ

హైదరాబాద్, డిసెంబర్3 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు సంబంధించి ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ జిల్లాల వారీగా బహిరంగ విచారణ చేపట్టేందుకు సిద్ధమైంది. కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు ఇప్పటికే పలు జిల్లాల్లో పర్యటించి అభ్యంతరాలను స్వీకరించారు. 5వ తేదీన నిజామాబాద్, 6న ఆదిలాబాద్, 7న కరీంనగర్‌లో బహిరంగ విచారణ చేపట్టనున్నారు. ఈ మేరకు కమిషన్ కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆయా ఉమ్మడి జిల్లాల ప్రజలు విచారణలో పాల్గొని రిజర్వేషన్లపై తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను వెల్లడించవచ్చని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్ అందించేందుకు గడువు నేటి (బుధవారం)తో ముగియనుంది.

రంగనాయకసాగర్‌కు సాగునీరు కష్టమే!

- లక్ష ఎకరాలకు గడ్డుకాలం
- అన్ని ప్రాజెక్టుల్లో 365 టీఎంసీలు
- మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల కింద మొత్తంగా 42 లక్షల ఎకరాలకు సాగునీరు
- స్టేట్‌లెవల్ సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): యాసంగి సీజన్‌లో అనంతగిరి, రంగనాయకసాగర్ ప్రాజెక్టు పరిధిలో దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరందించడం కష్టమేనని అధికారులు అభిప్రాయపడినట్టు తెలుస్తున్నది. ఎస్సారెస్పీ స్టేజీ-2కు నీరివ్వాలంటే ఎగువన ఆయకట్టుకు నీరివ్వలేమని అధికారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో సాగునీటి వినియోగానికి ప్రస్తుతం 365 టీఎంసీలు అందుబాటులో ఉండగా, వాటితో దాదాపు 42 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని స్టేట్ లెవల్ కమిటీ నిర్ణయించినట్టు సమాచారం. రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (ఎస్‌సీఐఈఏఎం) సమావేశాన్ని ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం జలసౌధలో నిర్వహించారు. టెరిటోరియల్ వారీగా చీఫ్ ఇంజినీర్లు చేసిన ప్రతిపాదనలపై కమిటీలో చర్చించారు. డిసెంబర్ మూడో వారం నుంచి సాగునీటి విడుదలకు సన్నద్ధం కావాలని ఇంజినీర్లకు కమిటీ సూచించింది. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, కడెం, నిజాంసాగర్, సింగూర్, నాగార్జునసాగర్, శ్రీశైలం తదితర మేజర్ ప్రాజెక్టుల్లో రానున్న జూన్ నెలాఖరు నాటికి తాగునీటి అవసరాలు పోగా, ప్రస్తుతం 285.34 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని కమిటీ లెక్కతేల్చింది. ఆయా ప్రాజెక్టుల కింద 30.58 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని ప్రతిపాదించింది. మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో 33.03 టీఎంసీలతో, 2.68 లక్షల ఎకరాలకు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో 37.40 టీఎంసీలతో 72.23 లక్షల ఎకరాలకు, ఐడీసీ లిఫ్ట్‌ల కింద 9.5 టీఎంసీలతో 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని చర్చించారు. మొత్తంగా 365.28 టీఎంసీలు అందుబాటులో ఉండగా, 42.11 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని నిర్ణయించారు. ఇందులో తడి పంటలు (వెట్ క్రాప్స్) 24.19 లక్షల ఎకరాలు, ఆరు తడి పంటలు (ఐడీ క్రాప్స్) 17.92 లక్షల ఎకరాలు ఉండటం గమనార్హం.

రంగనాయకసాగర్ ఆయకట్టుకు అనుమానమే

రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ సమావేశంలో ప్రధానంగా రంగనాయకసాగర్ ఆయకట్టుపై చర్చించినట్టు సమాచారం. ప్యాకేజీ 10, 11, 12, జగదేవ్‌పూర్, గజ్వేల్, రామాయంపేట, తుర్కపల్లి, ఉప్పరపల్లి కాలువల కింద మొత్తంగా దాదాపు లక్ష ఎకరాల ఆయకట్టు ఉన్నది. ప్రతి యాసంగి సీజన్‌లోనూ రాజరాజేశ్వర జలాశయం నుంచి అనంతగిరి, అక్కడి నుంచి రంగనాయక్‌సాగర్‌కు జలాలను తరలించి సాగునీటిని అందిస్తున్నారు. ఈ ఏడాది సాగునీటిని అందించలేమని కమిటీలో అధికారులు చేతులేత్తారు. ఎస్సారెస్పీ నుంచి దిగువకు ఆశించిన మేరకు జలాలు వచ్చే పరిస్థితి లేదని, ఈ నేపథ్యంలో ఎల్ఎండీ దిగువనున్న ఆయకట్టుకు రాజరాజేశ్వర జలాశయం నుంచే జలాలను అందించాల్సి ఉంటుందని, అక్కడి నుంచి ఎగువన అనంతగిరి, రంగనాయకసాగర్‌కు నీటిని అందించలేమని అధికారులు కమిటీలో అభిప్రాయం వ్యక్తంచేసినట్టు సమాచారం.

బీఆర్ఎస్ బాధ్యత.. కాంగ్రెస్ బడాయి !

- బీఆర్ఎస్ హయాంలో జాబ్ నోటిఫికేషన్లు
- గొప్పలు చెప్పకుంటున్న కాంగ్రెస్ సర్కారు
- గ్రూప్-4 నోటిఫికేషన్ ఇచ్చింది కూడా కేసీఆర్ సర్కారే
- నేడు నియామకపత్రాలు అందించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తాం... జాబ్ క్యాలండర్‌ను విడుదల చేస్తామంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీలు ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను దారుణంగా వంచించిందని విమర్శలు ఎదుర్కొంటున్నది. రెండు లక్షల ఉద్యోగాలు అంటూ ఆశచూపిన కాంగ్రెస్ సర్కారు ఏడాదిలో భర్తీ చేసింది కేవలం ఆరువేల లోపు ఉద్యోగాను మాతమ్రే. కేసీఆర్ సర్కారు హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లను కూడా కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటూ గొప్పలు చెప్పకుంటున్నదని గులాబీ నేతలు మండిపడుతున్నారు.

గోరంత పనికి.. కొండంత గొప్పలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం సంబురాలు నిర్వహిస్తున్నది. ఏడాది పాలనలో 54, 520 ఉద్యోగాలు భర్తీచేసినట్టు ప్రకటించింది. వీటిలో కొన్ని కారుణ్యనియామకాలు ఉన్నాయి. వీటిలో 50వేల ఉద్యోగాలకు గత బీఆర్ఎస్ సర్కారే నోటిఫికేషన్లు జారీచేసింది. కాంగ్రెస్ సర్కారు కొత్తగా 12,527 ఉద్యోగాల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్లు ఇచ్చింది. ఇందులో కూడా 5,973 మంది టీచర్లను భర్తీచేసింది.

కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు

కాంగ్రెస్ సర్కారు భర్తీ చేసినట్టు చెప్పుకుంటున్న నోటిఫికేషన్లు 2022, 2023లో వచ్చినవే. వీటిలో గ్రూప్-4 సహా పలు పరీక్షలను బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే నిర్వహించారు. పరీక్షలు కూడా గత ప్రభుత్వమే నిర్వహించింది. కేవలం ఫలితాలు విడుదల చేసి 8వేలకు పైగా ఉద్యోగాలను తామే భర్తీ చేశామని చెప్పుకుంటున్నది. ఈ మేరకు ఇవాళ పెద్దపల్లిలో నియామకపత్రాలు ఇచ్చేందుకు సిద్ధమైంది. బీఆర్ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లలో కొన్ని ఉద్యోగాల భర్తీకి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో వాటికి ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు నియామకపత్రాలిచ్చి గొప్పలు చెప్పుకుంటున్నది.

బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లు

ఉద్యోగం	సంఖ్య	నోటిఫికేషన్	పరీక్ష	నియామక పత్రాల జారీ
స్టాఫ్‌నర్సు	6,956	30-12-2022	2-8-2023	31-1-2024
కానిస్టేబుల్, ఎస్సై	17,805	25-4-2022	28-8-2022	14-2-2024
గురుకుల టీచర్	6,546	6-4-2022	1-8-2023	4-3-2024
గ్రూప్-4	8,093	11-12-2022	1-7-2023	4-12-2024
గ్రూప్-3	1,363	30-12-2024	17/18-12-2024	విడుదల కాని ఫలితాలు
టీచర్లు (డీఎస్సీ)	5,086	6-9-2023	మరో 5,973 పోస్టులు కలిపి నోటిఫికేషన్	
గ్రూప్-1	503	26-4-2022	పరీక్ష రద్దు, 60 పోస్టులు కలిపి నోటిఫికేషన్	
లెక్చరర్లు	1,392	9-12-2022	పరీక్షలు పూర్తి, ఇవ్వని నియామకపత్రాలు	
ఏఈఈ	1,540	3-9-2022	21-5-2023	ఫలితాలు విడుదల
ఏఈ	843	12-9-2022	18-10-2023	విడుదల కాని ఫలితాలు

మొత్తం **50,127**

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లు

ఉద్యోగం	సంఖ్య	నోటిఫికేషన్	పరీక్ష	ఫలితాలు
టీచర్లు (డీఎస్సీ)	5,973	29-2-2024	జూలై	30-9-2024
గ్రూప్-1	60	5-7-2024	జూన్ 9-2024	మెయిన్స్ విడుదల కాలే
స్టాఫ్‌నర్సు, ఇతర	6,494	30-11-2024	23-11-2024	ఫలితాలు ఇవ్వలేదు

మొత్తం **12,527**

బడ్జెట్‌పై ఆర్థికశాఖ కసరత్తు!

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆర్థిక మంత్రిత్వశాఖ 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్ తయారీ ప్రక్రియను ప్రారంభించింది. ఈ మేరకు ప్రతిపాదనలు పంపించాలని వివిధ శాఖలకు ఆదేశాలు జారీచేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క జనవరి మొదటి వారంలో వివిధ శాఖలతో సంప్రదింపులు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ వచ్చే ఫిబ్రవరిలో రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టనున్నట్టు సమాచారం. గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత తొలుత ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను మాత్ర మే ప్రవేశపెట్టింది. ఆ తర్వాత జూలైలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుత ఆర్థి క సంవత్సరంలో కొన్ని శాఖలకు తగిన ని ధులు కేటాయించకపోవడం, కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయిన పరిస్థితులు కనిపించాయి. ఇప్పటివరకు ఎంత ఆదాయం వస్తున్నది? దానిని ఎంత వరకు పెంచే అవకాశాలు ఉన్నాయి? అనే కోణంలో వివరాలు సమర్పించాలని ఆయా శాఖలను ఆర్థికశాఖ కోరినట్టు సమాచారం. వానకాలం శాసనసభ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆ తర్వాత బడ్జెట్ ప్రతిపాదనలపై అధికారిక సంప్రదింపులు జనవరి మొదటి లేదా రెండో వారంలో ప్రారంభం కావచ్చని తెలిసింది. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యం సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రధాన సవాల్‌గా మారనున్నది.

కరీంనగర్‌లోని ప్రెస్ భవనంలో మాట్లాడుతున్న తెలంగాణ యునైటెడ్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్

ఆటో డ్రైవర్లను ఆదుకోకపోతే ..

సీఎం పెద్దపల్లి టూర్‌ను అడ్డుకుంటాం

- ప్రభుత్వ వైఖరికి నిరసనగా 7న ఆందోళనలు చేస్తాం
- ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్

తెలంగాణచౌక్, డిసెంబర్ 3: ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోకుంటే బుధవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపల్లి టూర్‌ను అడ్డుకుంటామని' తెలంగాణ యునైటెడ్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్ భవనంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మద్దె రాజేందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి స్కీంతో రాష్ట్ర వ్యాప్తంగా 7లక్షల 50వేల ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ మ్యానిఫెస్టో చైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బాధ్యత వహించాలని, ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ల కుంటుంబాలకు రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా. వెయ్యి కోట్లతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రోజైన ఈ నెల 7వచ్చిన రాష్ట్రవ్యాప్తంగా ఆటో బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు చేస్తామని, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

• డబుల్ బెడ్‌రూం ఇండ్లలో వసతులు కల్పించండి

గత ప్రభుత్వం అందజేసిన డబుల్ బెడ్రూం ఇండ్లలో పూర్తిస్థాయి వసతులు కల్పించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. కీసర తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం, చీర్యాలలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లను అందజేసింది. ఏడాదికాలంగా సౌకర్యాలు కల్పించడం లేదని తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. – కీసర

• బురదలో కూర్చొని బీఆర్ఎస్ నేతల ఆందోళన

చిన్నపాటి వర్షానికే పెబ్బేరు రోడ్డు చిత్తడిగా మారడంతో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు బురదలో కూర్చొని నిరసన తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో నాటి మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారంతో వనపర్తికి వెళ్లే రోడ్డు విస్తరణ, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులను రూ.15కోట్లతో పనులు మొదలుపెట్టగా.. కాంగ్రెస్ సర్కారు రాగానే వాటిని అడ్డుకొని నిలిపివేయించిందని మున్సిపల్ వైస్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు ఆరోపించారు. –పెబ్బేరు

• డంపింగ్ యార్డు వద్దంటూ ఆందోళన

పొలాల మధ్య డంపింగ్ యార్డు వద్దంటూ వికారాబాద్ జిల్లా పరిగిలో రైతులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ డంపింగ్ యార్డుకు మంగళవారం ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలం పరిగి మండలంలోని రంగాపూర్, మాదారం, నజీరాబాద్